

చిగురిస్తున్న ఆశలు 9లో▸

జిల్లాలో ఈసారి అధికంగా వర్షాలు కురిసినా ఖరీఫ్‌లో ఆశించినంత దిగుబడులు రాలేదు. యాసంగి సాగుపై దృష్టి సారించారు. పంటలు ఆశాజనకంగా ఉన్నాయి.



సీఎం కప్ పోటీలు ప్రారంభం

సీఎం కప్ గ్రామస్థాయి పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను కమిటీలు పర్యవేక్షించాయి. కబడ్డీ, ఖోఖో, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.1 /21.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆదాయ వనరులు పెంచుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్

కుంటాల: గ్రామాల్లో ఆస్తి, నల్లా పన్నులు వసూలు చేయాలని, ఆదాయ వనరులు పెంచుకోవాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మండలంలోని అందాకూర్, కల్లూరు గ్రామాల్లో శనివారం పర్యటించారు. గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులను కొనసాగించాలని సూచించారు. మంచినీటి ట్యాంకుల్లో నెలకు మూడుసార్లు క్లోరినేషన్ చేయించాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించి వర్మికంపోస్టు ఉత్పత్తి చేయాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీంఖాన్, డీఆర్డీవో సూపరింటెండెంట్ శ్రీనివాస్, పీఆర్ డీఈ రాజేందర్, ఏఈ గౌరీశ్, ఏపీవో నవీన్, పంచాయతీ సెక్రెటరీలు రమ్య, భోజన్న పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

భైంసా: ట్రిపుల్‌ఐటీలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. ట్రిపుల్‌ఐటీ ప్రధాన గేటు ఎదుట కార్మికులతో కలిసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్, నాన్‌పర్మినెంట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 60 ప్రకారం రూ. 16,600 వేతనం చెల్లించాలన్నారు. పనిచేసే కార్మికులను కాంట్రాక్టర్లు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వేతనాలు పెంచాలని కోరితే ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని విమర్శించారు. నిరసనలో యూనియన్ అధ్యక్షులు పీరాజీ, కార్యదర్శి సాయిలు, విజయ, రుక్మవ్వ, గోదావరిబాయి, గంగన్న, లింగన్న, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఏసీ బస్ చార్జీలో 10 శాతం రాయితీ

నిర్మల్‌చైన్‌గేట్: ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ఈనెల 6 నుంచి 31 వరకు ప్రయాణికులకు టికెట్ చార్జీలపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. నిర్మల్ నుంచి జేబీఎస్‌కు రూ.500, హైదరాబాద్‌కు 520, రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు రూ.750 టికెట్ ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశం డిసెంబర్ 31 వరకు ఉంటుందని వెల్లడించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలో ముగ్గురు డిబార్

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థులను డిబార్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చయ్య తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 21 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడగా, వారిలో రెయిన్‌బో కళాశాలకు చెందిన 18 మంది, ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు, తపస్వి కళాశాలకు చెందిన ఒకరు డిబార్ అయినట్లు వెల్లడించారు.

ఆర్జీయూకేటీకి వీల్‌చైర్ల విరాళం



వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: బాసరలోని ఆర్జీయూకేటీకి స్వచ్ఛంద సంస్థ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఐదు మెడికల్ వీల్‌చైర్లను శనివారం విరాళంగా అందించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ దివ్యాంగులైన విద్యార్థులకు సమగ్ర విద్యను అందించడంలో విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతుగా ఈ విరాళం అందిందని తెలిపారు. మొబిలిటీ సహాయం అవసరమయ్యే విద్యార్థులకు మెడికల్ వీల్‌చైర్లు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. తద్వారా వారు విద్యా కార్యకలాపాల్లో పూర్తిగా పాల్గొనేలా చేస్తుందని పేర్కొన్నారు. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్, ఐఐఎఫ్‌టీ ప్రొఫెసర్ మురళీధరన్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు విద్యార్థులకు వీల్ చైర్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏవో రణధీర్ సాగి, ప్లేస్మెంట్ ఆఫీసర్స్ శ్రీనివాస్‌సాగర్, డాక్టర్ ఎస్.విజయ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిరాల.. చకచకా..

అది నిజాం కాలంనాటి ప్రాజెక్టు.. ఐదు గ్రామాల పరిధిలోని 1,800 ఎకరాలకు సాగు, తాగునీరు అందించింది. కానీ 2023 వానాకాలంలో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద పోటెత్తింది. ఎగువన ఉన్న చెరువులకు గండ్లు పడడంతో ప్రాజెక్టుపై ఒత్తిడి పెరిగింది. పాత ప్రాజెక్టు కావడంతో ఒత్తిడి తట్టుకోలేక గండి పడింది. దీంతో ఆయకట్టు రైతులు వరుసగా నాలుగు పంటలు నష్టపోయారు. ఎట్టకేలకు ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి.



సిరాల ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న కట్ట నిర్మాణ పనులు..

- మొదలైన ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు
- మొదటగా కట్ట పునరుద్ధరణ మరూ..
- కాలువలనూ శుభ్రం చేయిస్తున్న అధికారులు
- వచ్చే వానాకాలం నీళ్లు నిలవడమే లక్ష్యం

భైంసారూరల్: రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు భైంసా మండలం సిరాల గ్రామంలోని సిరాల ప్రాజెక్టులోకి భారీగా వరద పోటెత్తింది. దీంతో 2023 జూలై 27న ఒక్కసారిగా ప్రాజెక్టుకు గండి పడింది. దీంతో నీరు సమీప గ్రామాలను ముంచెత్తింది. ప్రాజెక్టు కింద పంట భూముల్లో రాళ్ల, మట్టి పేరుకుపోయింది. ఎవరి భూమి ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయకట్టు రైతులు వరుసగా నాలుగు పంటలు నష్టపోయారు. వచ్చే వానాకాలం నాటికి ఆయకట్టుకు నీరందించాలన్న లక్ష్యంతో అధికారులు పనులు చేపట్టారు. 1901లో ఈ ప్రాజెక్టును నిర్మించారు. సిరాల, ఇలేగాం, మచ్కల్, దేగాం, వాలేగాం గ్రామ శివారులో 1,800 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు నీరందేది.

కట్ట నిర్మాణం షురూ..

సిరాల ఆయకట్టు రైతుల ఆవేదనను అర్థంచేసుకున్న ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు చేసింది. గతేడాది టెండర్లు పూర్తయినా వర్షాలు ఉండడంతో పనులు ప్రారంభించలేదు. వర్షాలు తగ్గడంతోనే వారం రోజులుగా పనులు చకచకా జరుగుతున్నాయి. మొదటగా కట్టపనులు ప్రారంభించారు. తెగిపోయిన కట్టను పునర్నిర్మిస్తున్నారు. నల్ల మట్టిని తీసి తెగిపోయిన భాగంలో మొరం మట్టి పోస్తున్నారు. భారీ ప్రొక్లెయినర్లు, టిప్పర్లతో పనులు చేపడుతున్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి..

సిరాల ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ఈ సమయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలి. 320.19 ఎకరాల భూమిలో సిరాల ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. ఆక్రమణలు పెరగడంతో ఈ భూమి పూర్తిగా తగ్గిపోయింది. శిఖం భూముల సాగుతో రైతులు పంటలు పండిస్తున్నారు. ఫలితంగా ఆయకట్టు రైతులకు కావాల్సిన నీరు అందడం లేదు. 1901లో నిర్మించిన ఈ ప్రాజెక్టులో పూడిక కూడా పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీళ్ల లేవు. ఇలాంటి సమయంలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి చెరువుకు కేటాయించిన 320.19 ఎకరాల భూమికి హద్దులు ఏర్పాటుచేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం హద్దులు లేకపోవడంతో పక్కనే భూములు ఉన్న రైతులు శిఖం భూమిని కలుపుకుని పంటలు సాగుచేస్తుటన్నారు. నిజాం కాలంనాటి ఈ ప్రాజెక్టుకు మళ్లీ పూర్వ వైభవంవచ్చేలా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

కాలువను శుభ్రంచేస్తూ...

ప్రాజెక్టు తెగడంతో వచ్చిన నీటితో నాలుగు కిలోమీటర్లమేర ఉన్న సీసీ కాలువ నామరూపాలు లేకుండా పోయింది. కాలువ రాళ్ల, మట్టితో నిండింది. దీంతో కాలువను శుభ్రంచేస్తు అందులోచేరిన మట్టిని ఇతర వస్తువులను తొలగిస్తున్నారు. సిరాల నుంచి ఇలేగాం వరకు ఉన్న కాలువ మొదటగా శుభ్రంచేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు పక్కన వాహనాలు వెళ్లేందుకు రోడ్డు కూడా ఉపయోగపడుతుంది. కాలువ తెగడంతో సిరాల వరకు ఉన్న రోడ్డు కనిపించకుండాపోయింది. ప్రస్తుతం కాలువను శుభ్రంచేసేక్రమంలో తిరిగి పాత రోడ్డుపై తాత్కాలికంగా మట్టి వేసి లోడింగ్ వాహనాలు వచ్చిపోయేందుకు మార్గం వేస్తున్నారు. ఇదే మార్గం సిరాల, ఇలేగాం గ్రామాల రైతులకు ఉపయోగపడుతుంది.

పకడ్బందీగా నిర్మించాలి ....

నిజాం కాలంలో నిర్మించిన సిరాల ప్రాజెక్టు ఇప్పటి వరకు ఆయకట్టు రైతులకు నీరు అందించింది. మొదటిసారి ప్రాజెక్టు తెగడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి ప్రాజెక్టు కింద ఉన్న జరినాలలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం సిరాల నుంచి దేగాం వరకు జరినాల పూర్తిగా ఆక్రమించి పట్టాలు చేసుకున్నారు. జరినాలా ఎప్పటిలాగ ఉంటే వచ్చే నీరంతా అక్కడి నుంచే వాగులోకి కలిసే అవకాశం ఉంటుంది. జరినాలాలు పట్టాభూములుగా మారడంతో ప్రాజెక్టు నీరంతా పంట పొలాల నుంచి ప్రవహించి రైతులకు నష్టం కలిగిస్తోంది.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

కడెం: గ్రామీణ, పట్టణ ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఆర్థిక అక్షరాస్యతపై వాలంటీర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలు సైతం ఆర్థిక అక్షరాస్యత వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించాలని సూచించారు. సైబర్ నేరాలపై బ్యాంకు అధికారులు అప్రమత్తం చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, అందించే రుణాలు, బీమా సదుపాయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జన సురక్ష, పీఎం విశ్వకర్మ, ముద్ర, పీఎంఈజీపీ, పీఎం జీవన్‌జ్యోతి, అటల్ పెన్షన్ యోజన, పీఎం ఎఫ్‌ఎంఈ, ఇతర వ్యవసాయ రుణాలపై రైతులకు అవగాహన కల్పించారు. అర్హులైన వారు రుణాలు పొంది వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలైన డెయిరీ, కోళ్ల, చేపల పెంపకం, కుటీర పరిశ్రమ, కుల వృత్తులతో అభివృద్ధి చెందాలని తెలిపారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ మాట్లాడుతూ ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంపొందించేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీడ్స్ స్వచ్ఛంద సంస్థ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. అంతకుముందు వీడ్స్ స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారథి ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు సేవల వినియోగంపై ఏరియా కోఆర్డినేటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత కరదీపికలను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ సంతోష్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నరేశ్, అధికారులు, సిబ్బంది, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వెలమ సంఘం నాయకులు

నిర్మల్‌టౌన్: వెలమ సామాజికవర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్య తీసుకోవాలని వెలమ సంఘం జిల్లా నాయకులు పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. బాధ్యతాయుత ఎమ్మెల్యే పదవిలో ఉండి వెలమ కులస్తుల అంతు చూస్తానని బెదిరించడం, అసభ్య పదజాలంతో దూషించి మనోభావాలను గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతకుముందు పట్టణంలోని వెలమ సంఘ భవనంలో సమావేశమైన వెలమ కులస్తులు అక్కడి నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీలో దాదాపు 100 మందికిపైగా పాల్గొని ఎమ్మెల్యే శంకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో వెలమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రావు, తిరుమల్‌రావు, కోశాధికారి చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణ ఆరోగ్యకేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. పట్టణంలోని బంగల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించి లక్ష్యాలను సాధించాలని సిబ్బందికి సూచించారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

- తెలంగాణ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



బహుమతులు అందిస్తున్న అన్వేశ్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి

సారంగపూర్: కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందిందని, ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి చెందుతోందని తెలంగాణ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మహిళలకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలను రంగవల్లుల రూపంలో వేసిన మహిళలను అన్వేష్‌రెడ్డి అభినందించారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అన్వేష్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నామన్నారు. ఏడాదికాలంలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి స్థలం ఉన్న పేదలకు సొంత ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందిస్తుందని తెలిపారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, ఉపాధ్యక్షుడు విలాస్‌రావు, అడ్వొకేట్ నవీన్‌రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు పోతారెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్



మాట్లాడుతున్న రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్

మామడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతుల రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేసి అన్నదాతకు అండగా నిలిచిందని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ అన్నారు. మామడ రైతువేదికలో రైతు పండుగ కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాష్ట్రం ఏర్పాటు సమయంలో ఉన్న రూ.69 వేల కోట్ల అప్పు ఉండగా, బీఆర్‌ఎస్ పాలనలో అవి రూ.7 లక్షల కోట్లకు పెరిగాయన్నారు. రాష్ట్రంలో అర్హులైన రైతులందరికీ సంక్రాంతి కానుకగా రైతు భరోసా కింద పెట్టుబడిగా సాయం అందిస్తామని తెలిపారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయని మేలును కాంగ్రెస్ ఏడాదిలో చేసిందని పేర్కొన్నారు. రైతులు పండించిన సన్నరకం వరిధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు.

ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు భర్తీ..

తెలంగాణ వస్తే యువకులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేసీఆర్ పదేళ్లలో ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారని డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ చైర్మన్ ఏనుగు లింగారెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రఫీ, బాపయ్య, లింగారెడ్డి, జైసింగ్, గంగారెడ్డి, భూమేశ్వర్, లింగన్న, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాలకవ్వడి ఉత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్న గుట్ట ఆలయంలో స్కంద షష్టి పురస్కరించుకుని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పాలకవ్వడి ఉత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళ తాళాలతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ– మురళీధర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ గురుస్వామి మూర్తి, కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి



సైన్స్‌ఫెయిర్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన విద్యార్థులతో జిల్లా అధికారులు



నృత్యం చేస్తున్న చిన్నారి..

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- ముగిసిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్
- పలు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ రూరల్: విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని, అప్పుడే తెలుసుకోవాలనే కుతూహలం పెరుగుతుందని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో రెండురోజులు నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్ మేళా శనివారం ముగిసింది. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ప్రాజెక్టులు తయారు చేయడం శుభపరిణామం అన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ఆలోచన శక్తిని సైన్స్ రూపంలో ఉపాధ్యాయులు బయటకు తీయాలని సూచించారు. మన నిత్య జీవితంలో సైన్స్ ఎంతో అవసరమని తెలిపారు. ఇంట్లో ప్రతీరోజు వాడుతున్న వస్తువుల్లో సైన్స్ దాగి ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని, వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లదే అని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వాటిని తయారు చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు.

హ్యాట్రిక్ కొడతాం..

డీఈవో రామారావు మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో ఈసారి కూడా జిల్లాను రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలుపుతామని తెలిపారు. వరుసగా మూడుసార్లు మొదటిస్థానంలో నిలిపి హ్యాట్రిక్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షలకు మరో 90 రోజులు మాత్రమే ఉన్నాయని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా సైన్స్ ఫెయిర్ పరిశీలకులు, గౌహతి ఐఐటీ ప్రొఫెసర్ పింటూహతి, డీఎస్‌వో వినోద్‌కుమార్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు..

సైన్స్ ఫెయిర్ సీనియర్ విభాగంలో ఏడుగురు, జూనియర్ విభాగంలో ఏడుగురు మొత్తం 14 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఇన్‌స్పైర్ విభాగంలో 125 మంది పోటీ పడగా 13 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

సీనియర్ విభాగంలో..

కోటగిరి కీర్తన(9వ తరగతి, అల్‌ఫోర్స్ స్కూల్, నిర్మల్), సూరజ్(9వ తరగతి, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాయ్స్, ముధోల్), ఆర్.దివిజ(పదో తరగతి జెడ్పీహెచ్‌ఎస్ చించోలిఎం), ఏ.సంకీర్తన(9వ తరగతి, ఎంజేపీ, ముధోల్), బొమ్మల రాంసాగర్(9వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, కడెం), ప్రదీప్(9వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, నర్సాపూర్‌జి), రీతుచంద్ర(9వ తరగతి, సెయింట్ థామస్ స్కూల్, నిర్మల్).

జూనియర్ విభాగంలో..

వి.అక్షయ(7వ తరగతి, వికాస్ హైస్కూల్, భైంసా), జె.గౌరీ ప్రియ (7వ తరగతి, ఎంజేపి గర్ల్స్, ముధోల్), మరియం(7వ తరగతి, సన్‌షైన్ టాలెంట్ స్కూల్ నిర్మల్), శ్రేయస్‌కుమార్(6వ తరగతి, వాసవి వరల్డ్ స్కూల్ నిర్మల్), కార్తికేయ (7వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్ నిర్మల్), హన్విక(6వ తరగతి ఎంపీపీఎస్, కడ్తాల్), షణ్ముఖి(8వ తరగతి అల్ఫోర్స్ హైస్కూల్ నిర్మల్).

ఇన్‌స్పైర్ ప్రదర్శనలో..

సయ్యద్ లుక్మాన్ అలీ(హీరా మోడల్ స్కూల్), పి.రాముగౌడ్ (బాయ్స్ స్కూల్, నిర్మల్), కే.దర్శన్ (భాష్యం హైస్కూల్, నిర్మల్), బూస శ్రీహర్షిణి(రవి హైస్కూల్ నిర్మల్), మారంపల్లి కీర్తన్ (టీఎస్‌డబ్ల్యూ ఆర్‌జేసీ గర్ల్స్, జామ్), బి.వైష్ణవి(జెడ్పీహెచ్‌ఎస్, జాఫ్రాపూర్), తోట స్వీటీ (జెడ్పీహెచ్‌ఎస్, సారంగాపూర్), ఎస్.గాయత్రి(ఎంపీ యూపీఎస్, గుడిసర), ఏ.దినేష్(జెడ్పీహెచ్‌ఎస్ అష్ట), జె.రోహిణి(జెడ్పీహెచ్‌ఎస్, కామోల్), ఏ.నిఖిల్(జెడ్పీహెచ్‌ఎస్, స్వర్ణ), ఏ.మనీషా(కేజీబీవీ, భైంసా), సీహెచ్.హర్షిత్(శిశుమందిర్, భైంసా).



జిల్లాస్థాయి ఇన్‌స్పైర్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో అధికారులు

క్లుప్తంగా

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



ఎస్సైకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని భారతీయ వెలమ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అసభ్యపదజాలంతో దూషించడమే కాకుండా వారి అంతుచూస్తామని బెదిరించారన్నారు. వెలమ కులస్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన ఆయనపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అసోసియేషన్ నాయకులు రంగినేని మనిషా, పవన్‌రావు తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న 'అల్లోల'



ఆలయం ముందు స్థానికులతో ఇంద్రకరణ్‌రెడ్డి

జన్నారం: మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జన్నారం మండలం ఇందన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకుడు హరికృష్ణ, పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్, నాయకులు మేడారం ప్రదీప్, గోవర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, అమరవేణి నర్సాగౌడ్, గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ విక్రంరావు, అనుముల భాస్కర్, కొప్పుల శ్రీధర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సీవోఈ విద్యార్థి ఎంపిక



నిశాంత్‌ను అభినందిస్తున్న ఎంఈవో

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) గురుకుల విద్యాలయం పదో తరగతి విద్యార్థి ఎం.నిశాంత్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఎంఈవో పోచయ్య, ప్రిన్సిపాల్ శ్రీధర్ శనివారం ఆయన్ను అభినందించారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జోనల్‌స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిశాంత్ అండర్-17 విభాగంలో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్.విజయసాగర్, పీఈటీలు అల్లూరి వామన్, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయ్ మర్చంట్ టోర్నమెంట్‌కు ఎంపిక



కశ్యప్

ఆదిలాబాద్: బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే విజయ్ మర్చంట్ అండర్-16 టోర్నమెంట్‌కు జిల్లా కేంద్రానికి చెందిన కశ్యప్ ఎంపికయ్యాడు. మహారాష్ట్రలోని విదర్భ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. విజయవాడలో కర్ణాటక జట్టుతో జరిగే మ్యాచ్‌లో ఆడనున్నట్లు కోచ్ జయేంద్ర పటాస్కర్ తెలిపారు. ఇటీవల ఇండియన్ జూనియర్స్ అండర్-16 టోర్నమెంట్‌లో 15 వికెట్లు తీసి బెస్ట్‌బౌలర్‌గా నిలిచాడని పేర్కొన్నారు.

ఇక మూడో యూనిట్..

- బీహెచ్ఈఎల్‌కే మళ్లీ నిర్మాణ పనులు
- తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెర
- నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు
- రూ.9500 కోట్లతో 800 మెగావాట్ల ప్లాంటు
- త్వరలో పనుల ప్రారంభోత్సవానికి సన్నాహాలు



జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఇదే

జైపూర్: ఎట్టకేలకు మూడో యూనిట్ (800 మెగావాట్లు) థర్మల్ పవర్ ప్లాంటుకు మోక్షం కలగనుంది. రూ.9500 కోట్లతో నిర్మించనుండగా, తొమ్మిదేళ్ల నిరీక్షణ నిరీక్షణకు తెరపడనుంది. 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను విస్తరిస్తూ మూడో యూనిట్ నిర్మాణానికి సంస్థ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 2010లో రెండు యూనిట్లు (600+600) మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటు పనులు ప్రారంభించారు. 2017లో పూర్తిచేసుకుని ఈ యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభించుకుని రాష్ట్రానికి నిరంతరం విద్యుత్ కాంతులు పంచుతోంది. రెండోదశలో మూడో యూనిట్ నిర్మాణ పనులకు గత సీఎం కేసీఆర్ 2015లో శంకుస్థాపన చేశారు. టెండర్లను పిలవడానికే ఏళ్లు పట్టగా, గతేడాది తొలిసారి వేసిన టెండర్లను రద్దు చేయగా, ఈ ఏడాది మళ్లీ టెండర్లు పిలిచారు. మళ్లీ బీహెచ్ఈఎల్ కంపెనీ పాల్గొంది. సీఎండీ బలరాం నేతృత్వంలో ఢిల్లీ వేదికగా నాలుగైదు సార్లు ఇప్పటికే టెండర్ రేట్ కోడ్ల తగ్గుదలపై సంప్రదింపులు చేపట్టింది. బీహెచ్ఈఎల్, సింగరేణి మధ్యన ఒప్పందం ఒక్క దశకు చేరడంతో ఇక ప్లాంటు పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఒక పక్క థర్మల్ పవర్ ప్లాంటు మరోపక్క సోలార్ ప్లాంట్ల నిర్మాణంతో సింగరేణి విద్యుత్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలవనుంది. సీఎండీ బలరాం.. ఎస్టీపీపీపై ప్రధానంగా దృష్టిసారించారు. కొత్త ప్లాంట్ నిర్మాణంపై వేగవంతంగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని పనులు ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నట్లుగా తెలుస్తోంది.

విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు, నీరు

బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంటు కావడం విద్యుత్ ఉత్పత్తికి ప్రధానంగా బొగ్గు, నీరు అవసరం. ఇప్పటికే సింగరేణి సంస్థ అవసరానికి మించి ఇక్కడ భూముల సేకరణకు షెట్‌పల్లి గోదావరినది నుంచి ఒక టీఎంసీ నీరు, కోటపల్లి మండలం దేవులవాడ నుంచి 2 టీఎంసీల నీరు తరలింపునకు పైపులైన్ నిర్మించి పవర్ ప్లాంటుకు తరలిస్తున్నారు. ఇక సంస్థకు చెందిన భూగర్భ గనులు, ఓసీపీ ఉండడం శ్రీరాంపూర్ సీహెచ్‌పీ నుంచి ఎస్టీపీపీ బొగ్గు రవాణా చేయడానికి పర్మినెంట్‌గా రైల్వేట్రాక్‌లైన్ నిర్మించుకుని తరలిస్తున్నారు.

నిరుద్యోగుల ఎదురుచూపు

కొత్త ప్లాంటు నిర్మాణంపై స్థానిక నిరుద్యోగులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. రెండు యూనిట్లలో ఇప్పటికే భూనిర్వాసితులు సుమారు వెయ్యిమంది ఆయా విభాగాల్లో పని చేస్తుండగా పలు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు 500 మందికి పైగా ఉన్నారు. 800 మెగావాట్ల ప్లాంట్‌లో సుమారు 2 వేలకు పైగా మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ప్లాంటు నిర్మాణంతో వేలాది మందికి ప్రత్యక్షంగా వందలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ



కొత్తగా ప్లాంటు నిర్మించనున్న ప్రాంతం

800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నట్లు సమాచారం. గతంలో ఎస్టీపీపీలో పలు ప్రారంభోత్సవాలకు రావల్సిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పర్యటన చివరి క్షణంలో రద్దయింది. స్థానిక ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సీఎం రేవంత్‌రెడ్డిని కొత్త ప్లాంటు ప్రారంభోత్సవానికి తీసుకువస్తారని నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

రైస్‌మిల్లులో మోసం

- 1.5 క్వింటాల్ బియ్యం తరుగు
- ఆ బియ్యం డబ్బులు రైతుకు చెల్లిస్తానని నిర్వాహకుడు అంగీకారం



నిర్వాహకుడితో మాట్లాడుతున్న తహసీల్దార్

మందమర్రిరూరల్: మందమర్రి మండలం ఆదిల్‌పేట్ సమీపంలోని ఓ రైస్‌మిల్లులో రైతుకు మోసం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలోని రైతు వరిధాన్యంతో మిల్లుకు వెళ్లి బియ్యం పట్టించుకున్నాడు. సరిపడా బియ్యం రాకపోయేసరికి అనుమానంతో నిర్వాహకుడిని నిలదీయగా బుకాయించాడు. ఈవిషయమై తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. ఆయన రైస్‌మిల్లు వద్దకు చేరుకున్నారు. మిల్లులో ఏర్పడిన సాంకేతిక లోపం వల్ల తవుడులో బియ్యం కలిశాయని నిర్వాహకుడు అంగీకరించాడు. తరుగైన 1.5 క్వింటాల్ బియ్యం డబ్బులను రైతుకు ఇస్తానని నిర్వాహకుడు అంగీకరించడంతో సమస్య సద్దుమణిగింది. మిల్లును ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని మరోసారి ఇలాంటి ఘటన ఎదురైతే జరిమానా విధిస్తామని తహసీల్దార్ నిర్వాహకుడిని హెచ్చరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



చిన్నారుల నృత్య ప్రదర్శన

బాసర: ప్రభుత్వ ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల సందర్భంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవస్థానం అధికారుల వైదిక బృందం ఆధ్వర్యంలో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి కళాకారులు, చిన్నారుల నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఆలయ ఈవో విజయ రామారావు చిన్నారులకు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేద పండితులు నవీన్‌శర్మ, భక్తులు ఉన్నారు.

పారిశ్రామిక సంబంధాలు మెరుగుపర్చుకోవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పారిశ్రామిక సంబంధాలు మరింత మెరుగుపడడానికి ఒకరికొకరు సహకరించుకోవాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ సూచించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో ఏఐటీయూసీ, యాజమాన్యం మధ్య శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. త్వరలో జరిగే స్ట్రక్చర్ సమావేశం నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి బాజీసైదా పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే కార్మికుల సమస్యల పరిష్కారం

- యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



కాసిపేట 1ఇంక్‌లైన్ గనిపై మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట: ఏఐటీయూసీతో కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట-1 ఇంక్‌లైన్ గనిపై శనివారం ఏర్పాటు చేసిన గేటుమీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గత ఐదారేళ్లుగా స్ట్రక్చర్ మీటింగ్‌లు జరగక కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం, రాజకీయ జోక్యంతో అనేక సమస్యలు అలాగే ఉన్నాయని తెలిపారు. ఏఐటీయూసీ గెలిచిన తర్వాత డైరెక్టర్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించామన్నారు. డిస్మిస్ అయిన జేఎంటీ ఉద్యోగులకు అవకాశం కల్పించడం, మైనింగ్‌స్టాఫ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్లకు అండర్‌గ్రౌండ్ అన్‌ఫిట్ అయితే సూటెబుల్ జాబ్ ఇచ్చేందుకు ఒప్పందం జరిగిందని తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, సహాయ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్, సభాధ్యక్షుడు నాగేశ్వరరావు, ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, చిప్పరి శ్రీహరి, సెగ్గెం శంకర్, రంజిత్ కుమార్, అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనకా.. ప్రమాదానికా..!?

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థుల తరలింపు చూపరులను ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రాజెక్టులను తిలకించేందుకు విద్యార్థులను వ్యాన్‌లో తరలించారు. వ్యానులో కిక్కిరిసిపోయి ఉండగా నిల్చోవడానికి కూడా స్థలం లేకుండా పోయింది. కొందరు విద్యార్థులు వ్యానులో వేలాడుతూ ప్రయాణించడంపై పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రదర్శనకు వెళ్తున్నారా.. ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరంటూ ఆశ్చర్యపోయారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



వాహనంలో ప్రమాదకరంగా వెళ్తున్న విద్యార్థులు



శివాజీ చౌక్‌లో రోడ్డుపై ట్రాఫిక్ రద్దీలో ప్రమాదకరంగా వేలాడుతూ వెళ్తున్న విద్యార్థులు



వ్యాన్‌లో కిక్కిరిసి వెళ్తున్న విద్యార్థినులు

ఎన్నికల హామీలు అమలు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణి, అసెంబ్లీ ఎన్నికల ముందు గెలిచి అధికారంలో ఉన్న కార్మిక సంఘం, ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (టీజీఎల్‌బీకేఎస్)రాష్ట్ర కార్యదర్శి ఐ.కృష్ణ పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఎన్నోఏళ్లుగా పెండింగ్ ఉన్న క్యాడర్ స్కీమ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. మారుపేర్లతో పనిచేసే వారి పేర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అలవెన్స్‌లపై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. సమావేశంలో చాంద్‌పాషా, నరేశ్, ఎండీ జాఫర్, మల్లేశ్, అశోక్, కిష్టన్న, పి.శ్రీనివాస్, సంతోష్, కొమురయ్య, డి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి



బాధిత రైతుకు నగదు అందిస్తున్న అటవీ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం గంటలగూడెం అటవీ ప్రాంతంలో శనివారం చిరుత దాడిలో ఆవు మృతి చెందింది. బాబాపూర్‌కు చెందిన రైతు బానోత్ రాములుకు చెందిన పశువులు మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లగా ఆవుపై దాడి చేసి హతమార్చింది. సమాచారం అందుకున్న జోడేఘట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, సెక్షన్ అధికారులు మహేందర్, చంద్రకాంత్, బీట్ అధికారులు సాదిక్, స్వప్న, మారుతి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాడి చేసింది చిరుత అని తేల్చారు. బాధితుడికి అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.5 వేలు అందించారు. పులి సంచరిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని అధికారులు పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్

నేరడిగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా.. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ పెంపు వంటి అనేక హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో రైతు రుణమాఫీ ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొన్నారు. అలాగే రైతు భరోసాను షురూ చేయలేదని విమర్శించారు. మరోవైపు రాష్ట్రంలో వరంగల్, కొత్తగూడెం, రామగుండంతో పాటు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు శంకర్, రాజేందర్ రెడ్డి, కోటేశ్వర్, భీంరావు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాశీ, అయోధ్యలో నృత్యప్రదర్శన



సర్టిఫికెట్లతో విద్యార్థులు

బెల్లంపల్లి: ఈనెల 4న కాశీలోని అస్సీఘాట్‌లో సనాతన సాంస్కృతిక సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో బెల్లంపల్లికి చెందిన నటరాజ డ్యాన్స్ అకాడమీ నృత్య విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. కాశీ విశ్వేశ్వరుని నృత్య నీరాజనంలో హనుశ్రీ, శ్రీనికరాజ్, శ్రీఆశ్వీ, శ్రీనిక, షణ్ముక ప్రియ, అక్షయని, లక్ష్మీవర్షిణి, సాయి మనుజ్ఞ, శ్రీవర్షిణి, హస్విక, వైష్ణవి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. అదేవిధంగా అయోధ్యలో శనివారం సీతారాముల కు నృత్యనీరాజనం చేశారు. రామాయణ నృత్యం చేసి ఆకట్టుకున్నారు. అనంతరం వీరికి బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బెల్లంపల్లి సివిల్ కోర్టు న్యాయమూర్తి ముకేశ్, మాలోతు నవీన్, నృత్యగురువు అర్చన, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోథ్ ఎస్టీ బాలుర హాస్టల్ తనిఖీ



వంటగదిని పరిశీలిస్తున్న డీడీ వసంత్‌రావ్

బోథ్: మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌ను ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ వసంత్‌రావ్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. వ్యర్థపదార్థాలు ఉండటం, నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వండిన భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. అలాగే విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉండడంపై మండిపడ్డారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. వార్డెన్ జైతు, సీఆర్టీ విజయ్, సిబ్బంది ఉన్నారు.

గోదావరి నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



శివానంద్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న గజ ఈతగాళ్లు

బాసర: బాసర గోదావరి నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..తానూరు మండల కేంద్రానికి చెందిన శివానంద్ (37) గత నాలుగేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. తీవ్ర మనస్తాపంతో శనివారం బాసర గోదావరి వద్దకు చేరుకున్నాడు. బ్రిడ్జిపై చెప్పులు వదిలి..నదిలో దూకాడు. గంగపుత్రులు, ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకున్నారు. గంగపుత్రులు, గజఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి అన్న మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి..

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి సమీపంలో శనివారం రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. హమాలివాడకు చెందిన కనవేణి శ్రీనివాస్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు భార్య పుష్పలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాస్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న నయం కాలేదని తీవ్ర మనస్తాపం చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలుఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కె.సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం..కాగజ్‌నగర్ పట్టణంలోని న్యూకాలనీకి చెందిన అబ్బాస్ బేగం(80) గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా భిక్షాటన చేస్తూ తిరుగుతుండేది. ఈక్రమంలో శనివారం సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ ప్రాంతానికి చేరుకుంది. రైలు పట్టాలపై నుంచి వెళ్తుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని మృతిచెందింది. మృతదేహానికి పంచనామా చేసి సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆమె కూతురు ముంతాజ్ బేగంకు మృతదేహాన్ని అప్పగించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం ..జిల్లా కేంద్రంలోని ఆసరా కాలనీకి చెందిన ఇమాముద్దీన్ (60) శుక్రవారం రాత్రి చిట్యాల వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఇమాముద్దీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ..



సుమలత (ఫైల్)

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందింది. ఎస్సై సౌమ్య, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..సుమలత (35) శనివారం ఉదయం ఇంట్లో బట్టలు ఉతికి ఆరేస్తుండగా ప్రమాద వశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతిచెందింది. ఘటనాస్థలిని ఎస్సై సందర్శించారు. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ట్రాక్టర్ల నుంచి డీజిల్ చోరీ

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో రెండు ట్రాక్టర్ల నుంచి గుర్తుతెలియని దుండగులు డీజిల్ చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..మ్యాదరి సుధాకర్, ముస్కు సురేశ్‌లకు చెందిన ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ముద్దం రాజారెడ్డి ఖాళీ స్థలంలో పార్కింగ్ చేశారు. శనివారం ట్రాక్టర్లను పరిశీలించగా ఇంజిన్ల నుంచి సుమారు 100 లీటర్ల డీజిల్‌ను దుండగులు దొంగిలించారని గుర్తించారు. డీజిల్ విలువ సుమారు రూ.9500 ఉంటుందని యజమానులు తెలిపారు. మ్యాదరి సుధాకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.